గురునాథం చెరువు సుందరీకరణ షురూ..!

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురునాథం చెరువును స్వచ్ఛమైన మంచి నీటి చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయం అని తెలిపారు. చెరువు అభివృద్ధికి మల్లిగవాడ్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చైతన్య, రాములు, స్థానిక నాయకులు లోకేష్, అనిల్, రాజేష్, సుధాకర్, కేఎస్ బాబు తదితరులున్నారు.

ఆర్థికసాయం



కార్మికురాలికి రూ.20వేల నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ సభ్యులు

చందానగర్: పదో తరగతి విద్యార్థిని మణిరూప ఫీజు నిమిత్తం లయన్స్ క్లబ్ హోప్ రూ.20 వేలు అందజేసింది. సోమవారం చందానగర్‌లోని కార్యాలయంలో లయన్స్ క్లబ్ హోప్ సభ్యులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికురాలు సుశీల కుమార్తె 10వ తరగతి చదువుతుందని, ఫీజు చెల్లింపునకు ఇబ్బందులు పడుతున్న క్రమంలో సాయమందించామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, తొపుగుండ మహిపాల్‌రెడ్డి, బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శాంతి భూషణ్‌రెడ్డి, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, గాలి కృష్ణ, బర్కా మల్లేష్ యాదవ్, సింగాదాసరి రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నలుగురు అరెస్ట్

గచ్చిబౌలి: బార్ లైసెన్స్ ఇప్పిస్తానని ఘరానా మోసానికి పాల్పడిన నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు తెలుసని, బార్ లైసెన్స్‌లో ఇప్పిస్తానని చెప్పి కోటి రూపాయలు వసూలు చేసి ఉడాయించారు. ప్రధాన నిందితుడు నందారామ్ మిడిదొడ్డి వెంకట పవన్(25), అబ్బు సాయి ప్రకాష్ రెడ్డి(26), ఎరుపుల పవన్‌కుమార్ గౌడ్(36), మహ్మద్ అర్బర్ హుస్సేన్ (30)లను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు



స్కూల్ బస్ డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం ఇంద్రేశం చౌరస్తాలో సోమవారం సిబ్బందితో కలిసి ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, పిల్లలను దృష్టిలో పెట్టుకొని బస్సు నడపాలన్నారు.వాహనదారులలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. రాంగ్‌రూట్‌లో ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపొద్దని సూచించారు.

కుట్టుమిషన్ అందజేత



ఆల్విన్‌కాలనీ: హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సోమవారం జెట్టి కంసమ్మ అనే నిరుపేద మహిళకు వీల్ చైర్, మేరీకి కుట్టుమిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్యకు, వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. నాయకులు ధాతి రమేష్, షకీల్ మున్నా, వాలి నాగేశ్వరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

మూసాపేట: చైతన్య బస్తీలో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ మహేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర స్వామి, సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, ఐలయ్య, రవికుమార్ గౌడ్, రమేశ్ నాయర్, క్రాంతికుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

సీసీ..బీటీ... ఏ రోడ్డయితే మాకేంటి ?

అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు



దోవా కాలనీలో రోడ్డు తవ్వి బాగు చేయకుండా వదిలేయడంతో ఏర్పడిన గుంత

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- తవ్వకాలతో రాకపోకలకు ప్రజల అవస్థలు

మియాపూర్: ఎక్కడపడితే అక్కడ, ఎలా పడితే అలా..రోడ్లను తవ్వేస్తుండడంతో లక్షలాది రూపాయలు వృథా అవడంతో బాటు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లను కొందరు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ, తాగునీరు, ఇతర అవసరాలకు రోడ్లను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి పనులు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్, మయూరినగర్, దోవా కాలనీ, రెడ్డి కాలనీ, లక్ష్మీనగర్, బీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, ఆదిత్యనగర్, దీప్తిశ్రీనగర్, కృషినగర్‌తో పాటు పలు కాలనీలలో డ్రైనేజీ, తాగునీరు ఇతర అవసరాల కోసం పలువురు జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా రోడ్లను అడ్డంగా తవ్వుతున్నారు.
- పనులు పూర్తయ్యాక మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.కానీ అలాగే వదిలేస్తున్నారు. కొత్తగా వేసిన సీసీ, బీటీ రోడ్లను సైతం తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
- లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రోడ్లను ఇలా తవ్వి పాడుచేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రెడ్డి కాలనీలో..

- పనులు పూర్తయిన తర్వాత గుంతలు పూడ్చకుండా మట్టితో చదును చేసి అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు నామమాత్రంగా మట్టితో పూడ్చి పైపైన సిమెంట్ వేసి మరమ్మతులు చేస్తుండడంతో నిదానంగా గుంతలు ఏర్పడుతున్నాయి.
- రాత్రిపూట వాహనదారులకు ఈ గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.
- రోడ్లను తవ్వి ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మియాపూర్ మయూరినగర్‌లో సీసీ రోడ్డును తవ్విన దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మియాపూర్: మియాపూర్ మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవిచంద్ర తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏఎస్‌రాజునగర్, మిత్ర హిల్స్, ప్రశాంత్‌నగర్, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నందమూరినగర్, హెచ్ఎంటీహిల్స్, హోలిస్టిక్ హాస్పిటల్, నిజాంపేట్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

వేమనకాలనీ సబ్ స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్ నంబర్ 2,4,6,8 ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, ఆర్‌వి నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, ఇక్రిశాట్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవహిల్స్, గోల్డెన్ తులీప్ రోడ్ నంబర్ 1,2,3,4,5, వెంకటరమణ టాటా మోటార్స్ లేన్, హైటెన్షన్ రోడ్, జేవీజీహిల్స్, శిల్ప వ్యాలీ, సెంట్రల్‌పార్క్ ఫేజ్-2, గాయత్రిహిల్స్, కాంతివనం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే గచ్చిబౌలి పరిధిలో.. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ విలేజ్, హనుమాన్ టెంపుల్, ఎస్‌సీ బస్తీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్ వీడియా, ట్రెండ్‌సెట్, రాజపుష్ప, పుకెట్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ తెలిపారు.

ప్రజావాణి.. 4 వినతులు



ప్రజావాణిలో.. డిప్యూటి కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఇతర అధికారులు

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 వినతిపత్రాలు అందగా మూడు టౌన్‌ప్లానింగ్, ఒకటి రెవెన్యూ విభాగాలకు సంబంధించిన కాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎల్లప్పుడు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని తెలిపారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం డిప్యూటి కమిషనర్ ముకుంద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు 8 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 3, ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్, శానిటేషన్‌విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. ఈఈ దుర్గా ప్రసాద్, ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్‌కుమార్, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధే లక్ష్యం



సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, అధికారులు

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పాగార్డెన్స్, క్రాంతివనం, కేఎస్ఆర్ ఫ్రెండ్ కాలనీలో రూ.98 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలోని అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కొత్త అభివృద్ధి పనులు, మెట్రో రైల్వే విస్తరణ జరుగుతున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

చందానగర్: డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్‌లోని విశ్వేశ్వరయ్యకాలనీలో రూ.65 లక్షలతో, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ)పైప్‌లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్లు మంజులరఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు సమస్య ఉన్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు

కాలనీ సమస్యలు పరిష్కరించండి



బీఆర్‌యస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావును కలిసిన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్ కమిటీ సభ్యులు సోమవారం బీఆర్‌యస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావును ఆయన కార్యాలయంలో కలిశారు. కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సతీష్‌రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బీఆర్‌యస్ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సాయిగౌడ్, రాము, వెంకట్‌రావు, పాండు, శ్రీను, అశోక్, మాణిక్యం, కృష్ణ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



అరుణను సన్మానించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ స్టేట్ మహిళా కాంగ్రెస్ సెక్రటరీ అరుణను సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్‌లు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని, ఎన్‌టీఆర్ నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు అరుణ రంగారెడ్డి జిల్లా నుంచి ఎంపికయ్యారు. కార్యక్రమంలో మోజెస్, రాజ్యలక్ష్మి, సౌందర్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు, హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద జరుగుతున్న వరద నీటి కాలువ పనులను జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు డివిజన్‌లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్య ఏర్పడుతున్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. శాశ్వత పరిష్కారం దిశగా పనులు జరుగుతున్నాయని, ప్రజలు సంయమనం పాటించి ట్రాఫిక్ మళ్లింపు దగ్గర అధికారులకు సహకరించాలని కోరారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, సీఐ జానయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభలు



మణికొండ మర్రిచెట్టు కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

మణికొండ: ఇప్పటివరకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తు చేయని వారు మంగళవారం నుంచి నిర్వహించనున్న వార్డు సభలలో దరఖాస్తు చేయవచ్చని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కమిషనర్‌లు డి.ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకు వార్డుల వారీగా సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభల్లో ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేయని వారు ఈ సభలో ఇచ్చేలా కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వైస్ చైర్మన్, చైర్మన్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలిరోజు నిర్వహించనున్న వార్డు సభల వివరాలను మున్సిపల్ కమిషనర్ సుమన్ వెల్లడించారు. పెద్దగొల్కొండ, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, సిద్ధాంతి హరిజన సంఘం భవనం, సాతంరాయి వార్డు కార్యాలయం, మక్తాలోని మైనార్టీ కమ్యూనిటీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. మొహిన్ మహల్లాలోని అంగన్‌వాడీ కేంద్రం, తొండుపల్లి మున్సిపల్ కార్యాలయం, ఊట్‌పల్లి హనుమాన్ మందిరం వద్ద అంగన్‌వాడీ కేంద్రం, సిద్ధాంతి ముదిరాజ్ భవనం, వీకర్ సెక్షన్ కాలనీలో రెండు వేర్వేరు అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్డు సభలను నిర్వహించనున్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై సత్వర చర్యలు

రాజేంద్రనగర్: వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నారని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ వెల్లడించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. సంబంధిత ఫిర్యాదును అందజేసి అక్కడే పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం ఉందన్నారు. సోమవారం అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేశామన్నారు. స్వయంగా అధికారులే ఫిర్యాదుదారుని వద్దకు వెళ్లి ఆయా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ,ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్‌కు రూ. 96.73 కోట్లు

బండ్లగూడ: తెలంగాణ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ వద్ద దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను సోమవారం చెల్లించింది. స్టాంపు డ్యూటీ, మోటేషన్ ఫీజులు గత 2019 సంవత్సరం నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉండిపోవడంతో అవి మొత్తం రూ. 96.73 కోట్లకు చేరింది. రిజిస్ట్రేషన్ శాఖ వద్ద పేరుకుపోయిన స్టాప్ డ్యూటీ పూర్తిస్థాయి బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 96.73 కోట్లు నిధులు వచ్చాయి.

శరవేగంగా శంషాబాద్ అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలో రూ. 5 కోట్లతో చేపట్టనున్న 50 పడకల ఆస్పత్రి, రూ. 2.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పూర్తయిన పలు భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో మున్సిపాలిటీలో రూ. వంద కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రభుత్వం ఇటీవలే స్టాంపు డ్యూటీ నిధులతో పాటు ప్రత్యేక నిధులు సైతం విడుదల చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్లు వై.కుమార్, సంజయ్ యాదవ్, అజయ్, ప్రవీణ్‌గౌడ్,రేఖ, భారతమ్మ, పుష్పలత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్.. జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 36 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ. 2 వేలు జరిమాన, అదేవిధంగా 22 మందికి రూ. 1500 జరిమాన, మరో ఐదుగురికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా, ముగ్గురికి జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన పూర్తి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన సోమవారం పూర్తయిందని ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో మొత్తం 7 వేల దరఖాస్తులను పరిశీలించినట్లు వెల్లడించారు. తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దరఖాస్తుల పరిశీలనకు 25 మంది సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పూర్తి వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. రోజువారీగా దరఖాస్తుల పరిశీలన డేటాను అందజేశామన్నారు.

7 వేల దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రస్తుతం కంప్యూటర్‌లో పొందు పరిచామన్నారు.

హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మాలనుకోవడం దారుణం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీజ్ చేసిన వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: స్థలాల విక్రయంతో రేవంత్‌రెడ్డి సర్కారు కోట్లు దండుకోవాలనుకుంటున్నదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. కేపీహెచ్‌బీకాలనీ వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేసిన విషయం తెలుసుకుని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో కేపీహెచ్‌బీకాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్స్ పార్కులు, ఆట స్థలాలు, క్రికెట్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. హౌసింగ్‌బోర్డు స్థలాల్లో ప్రజా ప్రయోజనార్థం 10 శాతం భూములను ఆలయాలు, పాఠశాలలు, పార్కులకు కేటాయించాలని, అలాంటివి ఏం లేకుండా వేలం ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలని లేకుంటే ఈనెల 24న జరిగే వేలాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీశ్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేశ్, పవన్, సీఎల్. ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.